క్లుప్తంగా

'ఇంటి వద్ద విద్య'ను సద్వినియోగం చేసుకోవాలి


ఇంటి వద్ద విద్యను పరిశీలించిన నాగేశ్వరరావు

సామర్లకోట: పాఠశాలలకు వెళ్లలేని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఇంటి వద్దనే విద్య' నిర్వహిస్తోందని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. చదువుకోవాలనే ఆసక్తి ఉండి బడికి వెళ్లలేని వారి కోసం సమీపంలోని పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా నియమించిన వారితో విద్య నేర్పుతున్నట్టు తెలిపారు. పట్టణ పరిధిలో 10 మంది దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్దనే విద్య నేర్పనున్నట్టు ఆయన తెలిపారు. పాఠశాలలో పేర్లు నమోదు చేయించుకుంటే అమ్మఒడి, విద్యా కానుక అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ-2 పి.పుల్లయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలి


వడ్లమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

పెద్దాపురం: రాజమహేంద్రవరంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరులో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బలివాడ శ్రీలక్ష్మి, డి.అనూష, సుప్రజ, వర్ష, కావ్య బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామంలో రైతులకు వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, రైతులకు ఉపయోగపడే సూచనలిస్తూ 45 రోజుల పాటు గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. దీనిలో భాగంగా సచివాలయం భవనం వద్ద ర్యాలీని వీర్రాఘవరావు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి కళ, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

350 మందికి కంటి పరీక్షలు


కొత్తపల్లిలో రోగికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపల్లి: స్థానిక సురక్షా ఆసుపత్రిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 350 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 105 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి


ఐఎంఎఫ్ఎల్ డిపో వద్ద మోకాళ్లపై నిరసన తెలియజేసిన హమాలీలు

సామర్లకోట: స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీల కూలి రేట్లు పెంచా లని డిమాండ్ చేస్తూ శనివారం మోకాళ్లపై నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు హమాలీలు ఆందోళన చేస్తున్నారు. హమాలీల సంఘ ప్రధాన కార్యదర్శి వి.అప్పలరాజు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఐఎంఎఫ్ఎల్ డిపోను నమ్ముకుని జీవిస్తున్నామని, ఏటా కూలీ రేట్లు పెంచేలా కార్పొరేషన్ సంస్థ ఒప్పందం ఉన్నా దానిని అమలు చేయడం లేదన్నారు. హమాలీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కొండలరావు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల ఐదో తేదీన విజయవాడ ఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంఘ అధ్యక్షుడు బి. ఆదినారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి జపయజ్ఞ సంకీర్తన

బోట్క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని భోగి గణపతి పీఠంలో శ్రీవారి పాదాల వద్ద శనివారం సామూహిక సహస్రనామ పారాయణ జపయజ్ఞ సంకీర్తన నిర్వహించారు. పీఠంలో ఉన్న పంచలోహ శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ శ్రీవారి పాదాల వద్ద ఏడు శనివారాలు దీపారాధన చేసి వృద్ధులకు, అనాథలకు వస్త్రాలు, పాదరక్షలు, గొడుగులు, విసినకర్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యానానికి ఊతం తోటబడి

- తోటల్లో ప్రతి వారం పాఠాలు
- పొలంబడి తరహాలో రూపకల్పన
- 14 వారాల పాటు సూచనలు సలహాలు


దుంప తోట రైతులకు అవగాహన కల్పిస్తున్న వీహెచ్ఏ

పెద్దాపురం: అక్కడ రైతులే విద్యార్థులు.. అధికారులే ఉపాధ్యాయులు. పొలంబడి తరహాలో ఉద్యాన రైతులకు అధికారులు తోటబడి నిర్వహిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. వాణిజ్య పంటల్లో యాజమాన్య పద్ధతులపై ఈ బడిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపు, ఎరువుల వినియోగం, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోగాత్మకంగా వివరణ

తోటబడిలో రైతుల సందేహాలు నివృత్తి చేయడంతో పాటు, తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి, లాభాలు పొందే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరిస్తారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి సాగుతో సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి పంట చేతికందే వరకు తీసుకోవలసిన చర్యలను రైతులకు సూచిస్తున్నారు.

ప్రతి శుక్రవారం ఒక్కో గ్రామంలో

గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందికి ముందుగా శిక్షణ ఇచ్చి ప్రతి శుక్రవారం ఆయా తోటల్లో రైతులకు తోటబడి నిర్వహిస్తున్నారు. విత్తనం నాటిన రోజు నుంచి 14 వారాల పాటు రైతులకు సాగుపై మరింత ఆసక్తిని కనబరిచేలా సూచనలిస్తారు. సేంద్రీయ పద్ధతులలో ఎరువుల తయారీ, పక్షుల స్థావరాల ఏర్పాటు, పక్షులను ఆకర్షించే విధానాలపై సస్య రక్షణ చర్యలు వివరిస్తారు.

సబ్ డివిజన్లో 12 వేల ఎకరాల్లో..

పెద్దాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 12 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. పెద్దాపురం మండలంలో మెట్ట గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాలు, సామర్లకోటలో 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ఆయా పంటల పరిధిలో ఉన్న రైతులకు ఇప్పటి వరకు మూడు ప్రాంతాల్లో తోటబడి నిర్వహించారు.

ఉద్యాన పంటల రక్షణకే



రైతులకు పొలంబడి మాదిరిగానే ఉద్యాన పంటల రక్షణకు తోటబడి ఎంతో ఉపయోగం. ఉద్యాన పంటలపై దృష్టి సారించిన ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రధానంగా మామిడి, జీడి మామిడి, వంగ, బెండ, దొండ, మిరప, బీర, గుమ్మడి, అరటి, పామాయిల్ తదితర పంటలకు తరచూ వచ్చే తెగుళ్లు, చీడ పీడల నివారణకు చేపట్టాల్సి చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో ఒక ఎకరం భూమిలో ఉన్న తోటలనే ప్రమాణికంగా తీసుకుని విత్తనం నాటినప్పటి నుంచి సేంద్రియ ఎరువులతో సాగు చేయించడమే తోటబడి ప్రధాన ఉద్దేశం.

– ఎస్.సుజాత, ఉద్యాన శాఖాధికారి, పెద్దాపురం

తాగు, సాగు నీటి సరఫరాకు ప్రాధాన్యం

జెడ్పీటీసీ సూరిబాబు


తూర్పుపాకలులో తాగునీటి బోరుబావికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రజలకు అవసరమైన తాగు, సాగు నీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. మండలంలోని తూర్పుపాకల గ్రామంలో మండల పరిషత్ నిధులు సుమారు రూ.7.5 లక్షలతో చేపట్టే తాగునీటి బోర్వెల్, పైపులైన్, మంచి నీటి సరఫరా పనులకు శనివారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి రాంబాబు, పడాల రాఘవలతో కలిసి భూమిపూజ చేశారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు చొరవతో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ చర్యలు చేపట్టామన్నారు. నాయకులు మాదిరెడ్డి రాంబాబు, లక్ష్మి, పడాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పులిమేరు ఆశ్రమం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి



పులిమేరు యోగాశ్రమం వద్ద అల్పాహారం తీసుకుంటున్న దొరబాబు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు అభయాంజనేయ స్వామి యోగాశ్రమం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం శివాలయం పూజలకు వెళ్లుతూ శనివారం అభయాంజనేయ స్వామి ఆయుర్వేద కేంద్రం వద్ద ఉదయం అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా యోగాశ్రమ గురువు మసిముక్కల రామకృష్ణ అతి తక్కువ ఖర్చుతో ఆయుర్వేదం, అల్పాహారం అందించడంపై దొరబాబు అభినందించారు. అక్కడ యోగా మందిరానికి వచ్చే వారి సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని దొరబాబు హామీ ఇచ్చారు. అనంతరం యోగాశ్రమాన్ని పరిశీలించి పూజల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో తుమ్మల అచ్యుత రామయ్య, సుందరెడ్డి రాజు, తుమ్మల సూర్యకృష్ణమూర్తి, దాడి చంటి, ఎద్దు కుమార్, మలిపిరెడ్డి లోవ తదితరులున్నారు.

మహిళల భద్రతకు సీఎం జగన్ కృషి

- ఎంపీ వంగా గీత
- పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం
- పాల్గొన్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఉన్నతాధికారులు


పోలీస్ స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డీఐజీ అశోక్కుమార్, ఎస్పీ సతీష్కుమార్ తదితరులు

పిఠాపురం: రాష్ట్రంలో మహిళలు, శాంతిభద్రతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నిర్విరామ కృషి చేస్తున్నారని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలో రూ.70 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన పట్టణ పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ గీత, స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఏలూరు పోలీస్ రేంజి డీఐజీ అశోక్కుమార్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో శిథిలావస్థలో ఉన్న పిఠాపురం, జగ్గంపేట, తిమ్మాపురం పోలీస్ స్టేషన్లకు సీఎం జగన్ సహకారంతో రూ.3 కోట్ల వ్యయంతో కొత్త భవనాలు నిర్మించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో మహిళలపై దాడులు తగ్గాయని, ఆయన ప్రవేశపెట్టిన దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంలా మారిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హనుమంతరావు, రాష్ట్ర స్వచ్ఛ సర్వేక్షణ్ డైరెక్టర్ బత్తుల సాయి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పన శ్రీనాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పార్టీ యువజన విభాగం కార్యదర్శి సానా నాగు, సీఐ శ్రీనివాస్, ఎస్సై మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మండలంలో 6050 మందికి చుక్కల మందు


కొమరగిరిలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియోను నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేసినట్టు కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సుష్మ, సౌజన్య, రాజ్కుమార్ తెలిపారు. పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల్లోని ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేసి పిల్లలకు 100 శాతం చుక్కల మందు వేయాలని సూచించారు.

68 కేంద్రాల్లో..

మండలంలోని ఐదేళ్లలోపు పిల్లలు 6050 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారందరికీ వంద శాతం పోలియో చుక్కలు వేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 68 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నారు. 272 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారు. కొత్తపల్లి పీహెచ్సీ పరిధిలో 2634, కొమరగిరి పీహెచ్సీ పరిధిలో 962, నాగులపల్లి పీహెచ్సీ పరిధిలో 2454 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 8 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 181 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 173 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది గైర్హాజరైనట్టు వివరించారు.

జీజీహెచ్కు వెళ్లి పింఛను అందజేత

పెద్దాపురం: మండలం చదలాడకు చెందిన వలంటీర్ ఒబిలిశెట్టి సుబ్బలక్ష్మి తమ పరిధిలోని పింఛను లబ్ధిదారుకు కాకినాడ జీజీహెచ్కు వెళ్లి నగదు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైన రాజారత్నం జీజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శనివారం అక్కడకు వెళ్లి పింఛను అందజేశారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కొత్తపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ సూచించారు. స్థానిక వీవీఎస్ కళాశాలలో శనివారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు, ప్రజలు ఎన్నికల కోడ్పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను అభ్యర్థులు మద్యం, నగదుతో మభ్యపెట్టకుండా ప్రభుత్వం నిఘా పెట్టిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొ కబడ్డీ అంపైర్కు ఘన స్వాగతం


మురళీకుమార్కు స్వాగతం పలికిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

సామర్లకోట: ప్రొ కబడ్డీ అంపైర్గా వ్యవహరించిన బోగిళ్ల మురళీకుమార్కు శనివారం రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. 100 రోజుల పాటు వివిధ రాష్ట్రాలలో జరిగిన ప్రొ కబడ్డీ శుక్రవారం రాత్రితో ముగిసింది. పునరి ప్లాటిన్, హరియానాల మధ్య హైదరాబాద్లో జరిగిన ఫైనల్ మ్యాచ్కు ఆయన అంపైర్గా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన జగ్గంపేట జెడ్పీ హైస్కూల్లో పీడీగా పని చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వచ్చిన ఆయనకు ఎయిర్ పోర్టులో ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం, అంతర్జాతీయ క్రీడాకారులు కె.శ్రీను (బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి), పవన్కుమార్ (ఇన్కమ్ టాక్స్ ఉద్యోగి) కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తదితరులు ఘన స్వాగతం పలికారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని హంసవరం ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్)లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల మూడో తేదీ నుంచి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఏప్రిల్ 21న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి సిలబస్తో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు రూ.75 రుసుము మార్చి 31వ తేదీలోపు నెట్ బ్యాంకింగ్లో క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లించాలన్నారు. చెల్లించిన రుసుము జనరల్ నంబరు ఆధారంగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ లేదా ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హతలు

ఓసీ, బీసీ అభ్యర్థులకు 2012 సెప్టెంబర్ ఒకటి, 2014 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 2010 సెప్టెంబర్ ఒకటి, 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24లో ఐదో తరగతి చదువుతూ ఉండాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కరప: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ప్యానల్ న్యాయవాదులు డాక్టర్ వై.వసంత, పి.గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండల న్యాయసేవా అధికారి పి.కమలాదేవి ఉత్తర్వుల మేరకు శనివారం మండలం వేళంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, మహిళలకు సంబంధించిన వివిధ రకాల చట్టాలను న్యాయవాదులు వివరించి, వాటి ద్వారా ఎలా రక్షణ పొందవచ్చో అవగాహన కల్పించారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తిరుపతి శృంగారవల్లభ స్వామి. అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

- విరాళాలు, టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.5.15 లక్షల ఆదాయం

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. మాఘమాసం ఆఖరి శనివారం కావడంతో వేల సంఖ్యలో స్వామి వారి దర్శనానికి మరింతమంది తరలివచ్చారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.5.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు పదిహేను వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించండి

- ఎన్నికల ప్రక్రియ అవగాహనా సదస్సులో ఆర్డీవో జేవీఎస్ రామారావు


వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లెయిముల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్లో శనివారం ఎన్నికల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో వచ్చిన క్లయిమ్ల పరిష్కారంపై మరింత అవగాహన అవసరమన్నారు. ఆయా క్లయిమ్ల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ దాతృత్వం


సచివాలయానికి ప్రింటర్ అందిస్తున్న వలంటీర్ గంగాభవాని

పెద్దాపురం: ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి పారితోషకం తీసుకుని సేవలందిస్తున్న ఆ గ్రామ వలంటీర్ తన సచివాలయానికి తన వంతు సహాయం అందించాలని భావించింది. ఇటీవల ప్రభుత్వం నుంచి వలంటీర్ సేవా మిత్ర పారితోషికం అందుకున్న ఆమె.. తన సచివాలయానికి అవసరమైన ప్రింటర్ను బహుమతిగా అందించి, అందరి మన్ననలూ అందుకుంది. పెద్దాపురం మండలం చదలాడకు చెందిన దేవగుప్తపు గంగాభవాని ఐదేళ్లుగా గ్రామ వలంటీర్గా సేవలందిస్తోంది. సచివాలయానికి తమ వంతు సాయంగా సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు. సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా భవాని, ఆమె భర్త విజయ్ శనివారం ప్రింటర్ అందజేశారు.

మహావీర్ అనుగ్రహంతో ముక్తిమార్గం

- జైన్ల సన్యాస దీక్ష ర్యాలీలో ఎమ్మెల్యే ద్వారంపూడి
- పాల్గొన్న పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్


జైన మతస్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, పార్లమెంటరీ ఇన్చార్జి సునీల్ తదితరులు

కాకినాడ: సుఖం, ధనం, వ్యామోహాలను త్యాగం చేయడం ద్వారా ముక్తిమార్గాన్ని అనుసరించాలన్న మహావీర్ ప్రవచనాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్న జైన మతస్తులకు మరింత మంచి జరగాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. కాకినాడ జైన మతానికి చెందిన ప్రియల్ సన్యాసదీక్ష తీసుకుంటున్న సందర్భంగా శనివారం మార్వాడీలు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్సీపీ కాకినాడ పార్లమెంటరీ జిల్లా కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కొడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేవాలయంవీధి, తిలక్వీధి, రాజాజీవీధి, మెయిన్రోడ్డు మీదుగా టీటీడీ వరకు ప్రదర్శన నిర్వహించారు. కాకినాడతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జైనులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సుఖాలు, ఆడంబరాలకు దూరంగా త్యాగాలు చేసి దేవుని మార్గంలో నడిస్తే మోక్షం లభిస్తుందన్న ఆకాంక్షతో చిన్న వయస్సులోనే ప్రియల్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆమె ఆకాంక్ష నెరవేరాలన్నారు. కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ ప్రేమ, దయ గుణానికి మారుపేరుగా నిలిచే జైన మతస్తులకు అన్ని విధాలా మంచి జరగాలని ఆకాంక్షించారు. సుఖసంతోషాలను త్యాగం చేయడం ద్వారా మానవజన్మ ఉత్తమమైనదిగా భావించే జైనులు దీక్షా సమయంలో అత్యంత భక్తిభావంతో వ్యవహరిస్తారన్నారు. దేవుని అనుగ్రహం కోసం కఠోరదీక్షతో అనేక ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. జైన గురువు భక్తిరత్న గురూజీ ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, జైన్మత ప్రతినిధులు నిర్మల్కుమార్ జైన్, మహేంద్ర జైన్, సంజయ్ జైన్, కైలాష్ జైన్, ఆషిక్ జైన్, రజనీష్ జైన్, రమేష్ జైన్తోపాటు వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్వాడీలు పల్లకి ఊరేగింపులు, డప్పులు, వాయిద్యాలతో సందడి చేశారు.